ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

సోమవారం 16 జూన్ 2025

స్వదేశానికి చేరుకున్న పుష్ప 7

నయనానందకరం.. శ్రీవారి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కడప కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్రం సందర్భాన్ని పురష్కరించుకుని తిరుమల తొలిగడప దేవునికడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీదేవి-భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమూర్తి, తరుణ్, రఘునందన్, సాయి, అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేకంగా స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించి భక్తులు ఆనందపారవశ్యం పొందారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కడప రాయుడి కల్యాణ కార్యక్రమ దృశ్యం

అడ్డగోలు లేఅవుట్లు

కడప నగరంలో అనుమతి లేని లేఅవుట్లు అడ్డగోలుగా వెలుస్తున్నాయి. పాలకవర్గం, అధికారులు నగరంలోనే నివాసం ఉన్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనకొండగా పేరున్న ఓ అవినీతి అధికారి టౌన్‌ప్లానింగ్‌కు రావడంతో మళ్లీ ఈ అనధికార లేఅవుట్ల సంస్కృతి మొదలైంది. ఆయన.. నాది నాకిచ్చేయండి.. మీరు ఎలాగైనా వేసుకోండి అని డీల్ కుదుర్చుకుంటుండడంతో రియల్టర్లు నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా వెంచర్లు వేసేస్తున్నారు. ఇది తెలియని జనం లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్నారు. వీటికి బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కార్పొరేషన్‌లో 92 లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టారంటే నగరంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఆలంఖాన్‌పల్లె సర్కిల్ నుంచి తిరుపతి వెళ్లే నేషనల్ హైవే ఐచర్ షోరూం వెనక ఉన్న అనుమతి లేని లేఅవుట్

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొంటే ఇక పాట్లే
- రుణాలు కూడా ఇవ్వని బ్యాంకులు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కడప చుట్టూ అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. కొందరు వైసీపీ కార్పొరేటర్లు, నేతలు కలిసి వీటిని ప్లాట్లుగా విభజించి అమ్మి సొమ్ము చేసుకున్నారని చెబుతారు. పేరున్న నేతలే లేఅవుట్లు వేయడంతో జనం అనుమతులు ఉంటాయని అనుకుని మోసపోయి ప్లాట్లు కొనుగోలు చేశారు. అలాంటి వారు ఇప్పుడు అక్కడ ఇళ్లు కట్టుకోలేక, కట్టుకోవాలన్నా అనుమతులు రాక, బ్యాంకు రుణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సుమారు 92 లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టారు. అయితే మళ్లీ ఇప్పుడు అనుమతి లేకుండా లేఅవుట్లు నిర్వహిస్తుండడంతో మరోసారి మధ్యతరగతి కుటుంబాలు మోసపోయే ప్రమాదం కనిపిస్తోంది. చంద్రబాబు సర్కారు వచ్చిన తరువాత నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేసింది. లేఅవుట్ల 40 అడుగుల రోడ్డును 30 అడుగులకు తగ్గించింది. అనుమతులతో పాటు వైసీపీ కఠిన నిబంధనలు తీసివేసి అన్నింటినీ సులభతరం చేసింది. అవినీతికి అలవాటు పడ్డ ప్రాణం మారదన్నట్లుగా అనధికారిక లేఅవుట్లలో చేయి తిరిగిన రియల్టర్లు మళ్లీ ఇప్పుడు అదే బాట పట్టడం గమనార్హం.

ఇందులో భాగంగానే వినాయకనగర్ సమీపంలోని మినిస్టరు లేఅవుట్ పక్కనే సుమారు ఐదెకరాల్లో అనధికారిక వెంచరు వెలిసింది. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్‌లో కాసుల స్పెషలిస్టుగా పేరొందిన ఓ అధికారి ఈ అనధికారిక లేఅవుట్‌పై ప్రతాపం చూపించారంటారు. అయితే డీల్ సెట్ కావడంతో సైలెంట్ అయిపోయారంటారు. ఇక మద్రాసు రోడ్డులోని వైసీపీ జిల్లా కార్యాలయం సమీపంలో వైసీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే స్థలం ఉందంటారు. అక్కడ ఇప్పుడు అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. గుర్విరెడ్డి కుంట నుంచి వర్షం నీరు ఈ కాల్వ మీద ప్రవహించేదని చెబుతారు. అయితే ఇప్పుడు అక్కడ డెవలప్ అవుతోంది. సెంటు రూ.10 నుంచి 15 లక్షలు పలుకుతోంది. రియల్ ఎస్టేట్ నిర్వాహకులు కాల్వ స్థలాన్ని కూడా పూడ్చివేసి చదను చేసి వెంచర్ వేస్తుండడం గమనార్హం. ఈ లేవుట్ సమీపంలో అనధికారిక లేఅవుట్ ఉండేది. అందులో ఇరిగేషన్ కాల్వలో వెంచర్ వేశారంటూ ఎమ్మెల్యే మాధవి దృష్టికి రావడంతో అక్కడ ఇరిగేషన్ అధికారులు ఆ లేఅవుట్, కాల్వ ఉన్న ప్రదేశాన్ని తొలగించారు. అది అప్పట్లో పెద్దసంచలనంగా మారింది. కాల్వలు ఆక్రమించి వెంచర్ వేస్తే సహించేది లేదంటూ అక్రమార్కులకు, అనుమతి లేకుండా లేఅవుట్ వేసే రియల్టర్లకు ఓ గట్టి వార్నింగ్‌లా వెళ్లింది. ఇప్పుడు ఆ ప్రాంతంలోనే స్థలం ఆక్రమించి చదును చేసి లేఅవుట్ వేస్తుండడం గమనార్హం. అదేవిధంగా ఆలంఖాన్‌పల్లె సర్కిల్ నుంచి తిరుపతి వెళ్లే బైపాస్ రోడ్డులో ఐషర్ షోరూం సమీపంలో సుమారు 25 ఎకరాల్లో ఓ లేఅవుట్ వేశారు. దీనికి అనుమతి లేదు. ఇందులో వైసీపీ ప్రజాప్రతినిధులకు చెందిన కుటుంబ సభ్యులతో పాటు కార్పొరేషన్ అధికారులు భాగస్వామ్యం ఉన్నట్లు చెబుతారు. అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్-92ను బ్లాక్‌లిస్టులో పెట్టారు. అయితే ఇంత పెద్ద ఎత్తున వేసిన లేఅవుట్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టకపోవడం గమనార్హం. కార్పొరేషన్, వైసీపీ పాలకవర్గంలోనే ఉంది. వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి బంధువు, కార్పొరేషన్ అధికారులు పార్టనర్‌షిప్‌గా వేసిన వెంచర్ కారణంగానే దీన్ని బ్లాక్‌లిస్టులో పెట్టనట్లు ఆరోపణలున్నాయి.



వినాయకనగర్‌లో వెలసిన లేఅవుట్లు

మళ్లీ మొదటికి

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారు. వాటిపై జనాలు నష్టపోయారు. అయితే ప్రభుత్వం మారాక అనధికారిక లేఅవుట్ అనుమతి లేని నిర్మాణాలపై ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిలు ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్రమ లేవుట్లపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. దీంతో అక్రమ లేఅవుట్లకు చెక్ పడింది. అయితే టౌన్‌ప్లానింగ్‌కు అనకొండగా పేరున్న ఓ అవినీతి అధికారి రావడంతో మళ్లీ అనధికార లేఅవుట్ల సంస్కృతికి పురుడు పోశారంటారు. ఆయనకు నో రూల్స్. 'మీరు ఎలాగైనా వేసుకోండి.. నాది నాకిచ్చేయండ'ని డీల్ కుదుర్చుకుంటారని సమాచారం. రియల్టర్లు కూడా ఆయనతో కుమ్మక్కై ఆయనతో సెటిల్ చేసుకుంటున్నట్లు చెబుతారు. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేస్తే 30 అడుగుల రోడ్డు, 10 శాతం ఓపెన్ స్పేస్, సీసీ రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్ ఇతర వసతులు కల్పించాలి. ఇలా చేస్తే రియల్టర్లకు కూడా అదనపు భారం పడుతుంది. అదే ఆ అధికారితో డీల్ కుదుర్చుకుంటే ఓపెన్ ప్లేస్ లేకున్నా, రోడ్లు, డ్రైనేజీ లేకపోయినా సరే ఏదో వేశామంటే వేశామని, రెండు రోడ్లు వేసి, ప్లాట్లు అమ్ముకుంటే డబ్బు వస్తుంది. దీనివల్ల రియల్టరు బాగా సేఫ్ అవుతాడు. అందుకే ఆ అధికారి చెప్పిన డీల్‌కు రియల్టర్లు ఓకే చెప్పి అనధికార లేఅవుట్లు వేస్తున్నట్లు చర్చ నడుస్తోంది.



మద్రాసు రోడ్డులో ఇరిగేషన్ కాల్వ పూడ్చి లే అవుట్ వేస్తున్న దృశ్యం

ప్లాట్లు కొంటే పాట్లే

అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొంటే కొనుగోలుదారులు పాట్లు పడాల్సిన పరిస్థితి వస్తోంది. ఇక్కడ ఇల్లు కట్టుకోవాలంటే అనుమతులు రావు. వచ్చినా కూడా పెనాల్టీతో పన్నులు కట్టుకోవాలి. బ్యాంకు నుంచి రుణాలు రావు. ఇప్పటికే కార్పొరేషన్‌లో 92 లేఅవుట్లను బ్లాక్‌స్టులో పెట్టారు. అక్కడ కొనుగోలు చేసిన వారి దుస్థితి దారుణంగా ఉంది. అందుకే కొనుగోలుదారుల ప్లాట్లు విక్రయించే రియల్టర్ల నుంచి లేఅవుట్‌కు అనుమతి ఉందో లేదో చెక్ చేసుకోవాలి. లేఅవుట్‌లో రోడ్లు, కాల్వలు నీటి సౌకర్యం ఇతర మౌలిక సదుపాయాలు ఉన్నాయో, లేవో చూడాలి. చూసి కొనుగోలు చేయాలి. లేదంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక కార్పొరేషన్‌లో మళ్లీ పురుడు పోసుకున్న అనధికారిక లేఅవుట్లపై ఉక్కుపాదం మోపకుంటే కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతారు.

రెండు నెలలుగా పెరగని మిర్చి ధరలు

- పెట్టుబడులు కూడా రావని రైతుల ఆందోళన
- గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

7



మిరపకాయలు బస్తాలకు నింపుతున్న కూలీలు

సూపర్-6 పథకాలు అమలవుతాయి

- జగన్‌కు సూపర్ చెక్ పెడతాం
- జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి పాలనలో సూపర్-6 పథకాలు అమలవుతాయి.. జగన్‌కు సూపర్‌చెక్ పెడుతామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంవత్సరం క్రితం వరకు విలనిజం కొనసాగగా, సంవత్సరం కాలంగా హీరోయిజం ప్రారంభమైందని, విధ్వంసం నుంచి విశిష్టత కొనసాగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమరావతి, పోలవరం, రైల్వేజోన్, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక వాడలు అభివృద్ధి అవుతాయని తెలిపారు. తల్లికి వందనం పథకం అమలు అవుతుంటే తల్లిదండ్రులకు డబ్బులు పడకూడదని జగన్ భావిస్తున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని కేవలం కమ్మవారి కోసమేనని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ పాలనలో దేశం ప్రపంచంలో నాల్గవ స్థానంలో ఉండగా, దేశంలో మన రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు సీఎం చంద్రబాబు పి-4 పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ విద్యావ్యవస్థను నాశనం చేశారని, చివరకు రోడ్లపై గుంతలను పూడ్చలేకపోయారన్నారు. అంతేకాక రాష్ట్రంలో ఆయన మద్యానికి బదులు సారాయి విక్రయించారని, ఇసుకను అమ్ముకున్నారని, చివరకు ఉద్యోగుల పీఎఫ్ డబ్బులను వాడుకున్నారని విమర్శించారు. తెలంగాణాలో కేసీఆర్ నాలుగు లక్షల కోట్లు అప్పులు చేస్తే జగన్ అయిదేళ్ల పాలనలో ఆరు లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. కోడికత్తి డ్రామా, వివేకానందరెడ్డి హత్య డ్రామా, కంటికి గాయం డ్రామాలతో జగన్ రాష్ట్రానికి సూపర్ విలన్‌గా మారారని, ఆయన పరిస్థితి దావూద్ ఇబ్రహీం కన్నా దరిద్రమని పేర్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎంత హాయిలే ఇలా..



నిత్యం ఉరుకులు.. పరుగులతో జనం బిజీగా ఉంటారు. కనీసం కుటుంబంతో కలిసి కాసింత సమయం కేటాయించలేకున్నారు. తద్వారా మానసిక ఒత్తిడితో క్రుంగిపోతుంటారు. కానీ సెలవు దినం రాగానే ఉల్లాసంగా గడిపేందుకు కుటుంబ సభ్యులు ప్లాన్ చేస్తుంటారు. ఈ క్రమంలో వల్లూరు మండలంలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద ఆదివారం సందడి నెలకొంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా నీటిలో ఈదుతూ ఎంత హాయిలే ఇలా.. అంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తెచ్చుకున్న భోజనాలు ఆరగించి ఇంటికి పయనమయ్యారు. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

డయల్ 112 సేవలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ప్రజలకు ఎస్పీ సూచన



కడప క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలు పోలీసు హెల్ప్ లైను నెంబరు 112ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఉన్న పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 100కు బదులు 112గా ప్రభుత్వం మార్చిందని, ప్రజలు విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాలు, న్యూసెన్స్, కుటుంబ తగాదాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గొడవలు, అనుమానాస్పద వ్యక్తుల కదలిక వివరాలను డయల్ 112కు కాల్ చేసిన వెంటనే స్పందిస్తారన్నారు. పట్టణ ప్రాంతాల్లో బ్లూకోల్ట్స్, రక్షక్, పోలీసు వారు కేవలం 3-4 నిమిషాల వ్యవధిలో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే కేవలం 6-10 నిమిషాల్లోపు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెంబరు 24 ఇంటు 7 కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానమై అందుబాటులో ఉంటుందని, క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్, రక్షక్, పోలీసు సిబ్బందికి క్షణాల్లో సమాచారం వెళుతుందని తెలిపారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా పోలీసుసేవలను ఉపయోగించుకుని ఇళ్లల్లోని విలువైన వస్తువులకు రక్షణ కల్పించుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటికి తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఈ ఫోను నంబరుకు 8186881100కు సమాచారం ఇస్తే పోలీసు వారు వచ్చి మీ ఇంటిలో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను అమర్చుతారని ఎస్పీ తెలిపారు.

మైదుకూరుకు నీరు తెస్తాం : ఎమ్మెల్యే



మరమ్మతులకు నోచుకోని అలగనూరు ఆనకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, జయసూర్య

మైదుకూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్‌లోని ఆనకట్టను పూర్తి చేయించి మైదుకూరుకు నీరు తెస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. నందికొట్కూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్యతో కలిసి ఆయన ఆదివారం అలగనూరు రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పుట్టా మాట్లాడుతూ 1985లో మాజీ సీఎం ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారని, తరువాత 2004లో సుమారు రూ.60 లక్షలు ఖర్చు చేసి రిజర్వాయర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అలగనూరు రిజర్వాయర్ దాదాపు 2.95 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగి ఉందని, అయితే 2017 సంవత్సరంలో 2.6 టీఎంసీల నీటిని నిల్వ చేయగా ఆనకట్టకు గండిపడిందని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో మరమ్మతుల పేరుతో మొదలు పెట్టి మధ్యలోనే వదిలిపెట్టారని విమర్శించారు. అలగనూరు పూర్తయితే సుమారు లక్ష ఎకరాలకు నీటిని అందించగలమని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పనుల మంజూరుకు అనుమతులను తెప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రొద్దుటూరుటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఈనెల 20వ తేది నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. కౌన్సెలింగ్ కోసం ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250ల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ఫీజును 20-27వ తేది వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలని, అభ్యర్థులకు 21-28 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 25-30వ తేది వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, జూలై 1న వెబ్‌ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉందన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు రిసిప్టు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కులిస్టు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఓసీ అభ్యర్థులు 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి

కడప ఎడ్యుకేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.షంషుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు, భాషా పండితులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సంబంధించి ఈ ప్రక్రియ ముగిసినట్లు ఆయన తెలిపారు.

లంకమలలో కూంబింగ్

సిద్దవటం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : లంకమల అభయారణ్యంలోని సమస్యాత్మక అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ డి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక అనుమానిత అటవీ ప్రాంతాల ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. అటవీ ప్రాంతాలు ఆనుకుని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా గ్రామస్థులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ బీట్, సహాయ బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లె ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

లక్షలు పోశారు..
లక్షణంగా వదిలేశారు!

పశుపోషకులు, కొనుగోలుదారుల సౌకర్యార్థం గొర్రెల సంతలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. 14 ఏళ్ల క్రితం ప్రాంతీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ. 25 లక్షల వ్యయంతో ఈ భవనాలు నిర్మించారు. అధికారులు ఈ భవనాలను వినియోగంలోకి తేకుండా గాలికి వదిలేశారు. దీంతో కనీస వసతులకు నోచుకోని వ్యవసాయ మార్కెట్ యార్డులోనే వారపు సంతలు నిర్వహిస్తున్నారు.

- గొర్రెల సంతలో నిరుపయోగంగా భవనాలు
- అరకొర వసతుల మధ్య సంత నిర్వహణ
- వ్యాపారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



వ్యాపారుల కోసం నిర్మించిన భవనం



గొర్రెల సంత కోసం నిర్మించిన షెడ్డు

పీలేరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం, ఎర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ వద్ద రెండు ఎకరాల స్థలంలో గొర్రెల సంత ఏర్పాటుకు 2011, జనవరి 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. భవనాల నిర్మాణం కోసం రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేశారు. సత్వరం నిధులు మంజూరు కావడంతో ఆగమేఘాల పై భవనాలు నిర్మించారు. వ్యాపారుల వెయిటింగ్ హాల్, భవన నిర్మాణం పూర్తి అయినా మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యంతో నాటి నుంచి నేటి వరకు నిరుపయోగంగా దర్శన మిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ నడిబొడ్డున ఉన్న వ్యవ సాయ మార్కెట్ కమిటీ అవరణలో ప్రతి బుధవారం పశువుల సంత, ఆదివారం గొర్రెల సంత నిర్వహిస్తున్నారు. వారం వారం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. తద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం బాగానే వస్తోంది. అయినా, వ్యాపారులు, రైతులకు గుక్కెడు తాగునీరు, టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతుల కల్పనలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.
కూటమి ప్రభుత్వంలో కొత్తగా కొలువు దీరిన పాలక వర్గమైనా గొర్రెల సంత భవనాలను వినియోగంలోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పట్లో సంత కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలం నేడు కోట్లాది రూపాయల విలువ చేస్తోంది.

మొదటి సమావేశంలో చర్చిస్తాం...



గొర్రెల సంత కోసం కేటాయించిన స్థలం ఎలా వినియోగించుకోవాలన్న అంశం వ్యవ సాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం మొదటి సమావేశంలో చర్చిస్తాం. రైతులకు వసతుల కల్పనతోపాటు మార్కెట్ కమిటీ ఆదాయ మార్గాలను పెంచుకోవడంపై నిర్ణయం తీసుకుంటాం. మార్కెట్ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటాం.

-పురం రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్

'ప్రతిభా పురస్కారం విద్యార్థి ఉన్నతికి దిక్సూచి'



ప్రతిభా పురస్కారాలందుకున్న విద్యార్థులతో కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కడప మారుతీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దిక్సూచిలాంటివని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించే క్రమంలో వారిలో నూతనోత్తేజం నింపగలవని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులతోపాటు, కడప నగర పరిధిలోని ప్రయివేటు పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు నగదుతోపాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులంలోని వెనుకబాటుతనం, పేదరికం, అసమానతలు తొలగించే విధంగా ప్రతిభా పురస్కారాలను అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉన్నతస్థానానికి వెళ్లిన తర్వాత కులానికి, సమాజానికి ఉపయోగపడినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత సిద్ధిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు సైతం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు, మాట్లాడుతూ15 ఏళ్లుగా సంఘం తరఫున ప్రతిభాపురస్కారాలు అందజేయడాన్ని అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులుగోవిందునాగరాజు, సూర్యనారాయణ, కె. భాస్కర్, సుబ్రమణ్యం, పి.మురళీ కృష్ణయ్య, చౌడం సూరిబాబు, ఎస్. ఆంజనేయులు, బి. చంద్రశేఖర్, సి. వెంకటేష్, బి. వెంకటస్వామి, డి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశానికి చేరుకున్న పుష్ప

పీలేరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కువైట్ లో కష్టాలు పడుతున్న కేవీపల్లె మండ లం గ్యారంపల్లెకు కురవపల్లెకు చెందిన పుష్ప ఆదివారం ఉదయం హైదరాబాదుకు చేరుకుంది. కువైట్‌లో తాను నానా ఇబ్బందులు పడుతున్నానని, తనను ఆదుకోవాలని ఆమె వీడియో ద్వారా నారా లోకేశ్ విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. కువైట్‌లోని ఎంబసీ, అక్కడి టీడీపీ ఎన్ఆర్‌టీ విభాగం నేతలతో మాట్లాడి ఆమెను స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేశారు. కువైట్ సభ్యులు ఆమెకు శనివారం రాత్రి విమానం టికెట్ బుక్ చేసి ఆదివారం ఉద యం విమానం ఎక్కించారు. తమ కుమార్తె హైదరాబాదులో సురక్షితంగా ఉన్నట్లు పుష్ప తల్లిదండ్రులు తెలిపారు. పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ను సోమవారం విజయవాడలో కలిసిన తరువాత స్వగ్రామానికి వస్తుందని వారు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని వెంగంవారి పల్లి పంచాయతీ మద్యంవారిపల్లికి చెందిన రమణారెడ్డి (55) ద్విచక్ర వాహనంపై కందూరు వెళ్లి వస్తుండగా బాలినాయునిపల్లి సమీపంలో రంగారెడ్డి కాలనీకి చెందిన చంద్రశేఖర్ (45) నడుపుతున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయ పడిన రమణారెడ్డిని ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు యత్నిం చారు. ఆదివారం స్థానిక శేషమహల్ వీధికి చెందిన సురేష్(39) పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కు టుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. బసినికొండకు చెందిన శివశంకర్(30) కూలి పనులు చేస్తుంటాడు. అతను కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అతనిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

తంబళ్లపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రంపై ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మండెంవారిపల్లెకు సమీపంలోని ఓ చింత చెట్టు కింద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడగా, ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. అరెస్టయిన వారి నుంచి రూ.1,01,800లతో పాటు, 5 ద్విచక్రవాహనాలు, 10 సెల్‌ఫోన్‌ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రెండు కుటుంబాల ఘర్షణ

ముద్దనూరు జూన్15(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి మళ్లింపు విషయమై ఆదివారం అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఘర్షణ జరిగినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని రాజులగురువాయపల్లె లో పక్క పక్కనే నివాసం ఉన్న అన్నదమ్ములు పిల్లలు వర్షపు నీరు మళ్లించేందుకు ఇళ్ల వద్ద మట్టి కుప్పలు వేసుకున్నారు. ఈ విషయమై ఘర్షణపడగా ఒక కుటుంబానికి చెందిన రఘునాథరెడ్డి మరో ఇద్దరు, మరో కుటుంబానికి చెందిన పుల్లారెడ్డి మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పోరుమామిళ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసులపల్లె అనుమానాస్పద స్థితిలో ఓమహిళ మృతి చెందింది. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాలిలా .. కలసపాడు మండలం చింతలపల్లెపంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మహాలక్ష్మి (25)కి దమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని సుంకేసులపల్లెకు చెందిన చెముడూరి నరేంద్రతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది, వీరికి ఆరేళ్ల, నాలుగేళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం నరేంద్ర తన అత్తకు ఫోను చేసి మహాలక్ష్మి ఉరి వేసుకుందని, తాను కూడా బతకనని చెప్పాడని ప్రస్తుతం అతని ఫోను కూడా స్విచ్ఛాఫ్ కావడంతో గాలిస్తున్నామన్నారు. మహాలక్ష్మి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాడి రైతుల జీవనోపాధుల పరిశీలన

సంబేపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె గ్రామాన్ని ఆదివారం జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ప్రతినిధి, నాబార్డు అధికారులు సందర్శించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో గాండ్లపల్లెకు చెందిన 40 మంది పాడి రైతులకు నాబార్డు ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ అంబ్రెల్లా ప్రోగ్రాం ఫర్ న్యాచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ (యూపీఎన్ఆర్ఎం) కింద గొర్రెలు, పశువుల కొనుగోలు కోసం సూక్ష్మరుణాలు మంజూరు చేసింది. 2020లో రుణాలు తీసుకున్న రైతులు తాము తీసుకున్న మొత్తాలను చెల్లించేశారు. గడిచిన ఐదేళ్లలో ఆయా రైతుల జీవన స్థితిగతులలో వచ్చిన మార్పులను ఆదివారం కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ప్రతినిధి లుకినా, నాబార్డు డీడీఎం విజయ విహారి పరిశీలించారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధి, జీవనశైలి పెరుగుదలకు ఏమైనా చర్యలు తీసుకోవాలా అంటూ వారు రైతులను అడిగి తెలుసుకున్నారు.
ఆవులు, గొర్రెలను మేపుకుని గడిచిన ఐదేళ్లలో తాము ఎంతో అభివృద్ధి సాధించామని రైతులు వారికి తెలియజేశారు. ఆర్‌హెచ్‌జీబీ ఎంఎస్ఎస్ సంస్థ జనరల్ సెక్రటరీ బీవీ రత్నం గ్రామంలోని డెయిరీ యూనిట్లను వారికి చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీబీ ఎంఎస్ఎస్ సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు, నాబార్డు ప్రతినిధులు

ఆధునిక తెలుగు కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు కవిత్వానికి ఆద్యుడు మహాకవి శ్రీశ్రీ అని రచయిత జింకా సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో శ్రీశ్రీ వర్ధంతి సభను నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి ఆధునికత జోడించిన కవి శ్రీశ్రీ అన్నారు. సంప్రదాయ కవిత్వాన్ని ధిక్కరించి అభ్యుదయ భావాలతో ఆధునిక కవిత్వానికి పునాది వేశారన్నారు. మహాప్రస్థానం ద్వారా తెలుగు సాహితీరంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో విరసం వరలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక సభ్యుడు ఆరవేటి చంద్రశేఖర్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, వెంకటసుబ్రమణ్యం, రామారావు, సహదేవుడు, సారథి, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళులు అర్పిస్తున్న జింకా సుబ్రమణ్యం తదితరులు

రెడ్డి సామాజిక వర్గం విద్యాపురోగతికి బాటలు

కడప కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థుల విద్యా పురోగతికి రెడ్డి సేవాసమితి ఉపకార వేతనాలిస్తూ 25 ఏళ్లుగా ఉన్నత చదువులు చదివిస్తున్నదని రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు కె. నాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం రాజీవ్ మార్గ్‌లో గల రెడ్డి సేవాసమితి ప్రాంగణంలో సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఇంజనీరింగ్, వైద్య విద్యార్థులకు రెండు లక్షల రూపాయల ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. 20 25-26 విద్యా సంవత్సరానికి 8, 9, 10, తరగ తులలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అర్హు లైన 12 మంది బాలికలను ఉన్నత విద్య పాఠ శాలలో విద్యా బోధనతో పాటుగా కడపరెడ్డి హాస్టల్‌లో వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, నాయకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణరెడ్డి, డి.రామచంద్రారెడ్డి, పి. కుమారి, ఎన్. ఆనందకుమార్ రెడ్డి, ఎల్. మధుసూదన్‌రెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.



సభనుద్దేశించి మాట్లాడుతున్న కె. నాగిరెడ్డి

17 నుంచి నరవాడ జాతరకు ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నరవాడ వెంగమాంబ జాతరలో భాగంగా ఈ నెల 17 నుంచి 19 వరకు బద్వేలు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండుల నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 మధ్యాహ్నం నుంచి 19న సాయంత్రం వరకు బద్వేలు ఆర్టీసీ బస్టాండు నుంచి పది ప్రత్యేక బస్సులు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు నుండి ఐదు ప్రత్యేక బస్సులను వెంగమాంబ జాతరకు నడుపుతామన్నారు. సాధారణ బస్ చార్జీలే ఉంటాయని చార్జీల పెంపు ఉండదని అన్నారు. బద్వేలు , పోరుమామిళ్లకు చెందిన ప్రజలు జాతరకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చైతన్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు శరవణకుమార్ మృతి



బి.కొత్తకోట, జూన్15(ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు కొత్తగా పరిచయం అక్కరలేని చైతన్య శరవణకుమార్ ఆదివారం తుదిశ్వాస విడిచారు. వాయల్పాడు కు చెందిన శరవణకుమార్ (55) 1991లో బి.కొత్తకోటకు చేరుకొని చైతన్య స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. గ్రామస్థాయిలో రైతులను చైతన్యపరుస్తూ, ప్రభుత్వ సేవలు, పథకాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. వాటర్‌షెడ్, గ్రామాణాభివృద్ధి సంస్థల ద్వారా అనేక వ్యవసాయాధారిత పనులు చేయించారు. వివిధ స్థాయిల అధికారులను బి.కొత్తకోటకు రప్పించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతు సేవా కార్యక్రమాలతో 30 ఏళ్లకు పైగా సేవలు అందించిన శరవణకుమార్ ఇటీవలికాలంలో అనారోగ్య కారణాలతో కాస్త విరామం తీసుకున్నారు. బి.కొత్తకోటలో స్థిరనివాసం ఏర్పరుచున్న ఆయన కోరిక మేరకు ఆదివారం వాయల్పాడు సమీపంలోని ఓ కుగ్రామంలో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు పట్టణ ప్రముఖులు నివాళులు అర్పించారు.

రెండు నెలలుగా పెరగని మిర్చి ధర

● పెట్టుబడులు కూడా రావని రైతుల ఆందోళన

లింగాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పతనంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాలం ఇప్పటికే సగం పూర్తి కావడంతో పెట్టుబడులు అయినా వస్తాయో రావోనని రైతులు భయపడిపోతున్నారు. లింగాల మండలంలోని ఇప్పట్ల, చిన్నకుడాల, గుణకనపల్లె, అంబకపల్లె, లింగాల, మురారిచింతల, కోమన్నూతల తదితర గ్రామాలలో రైతులు ఫిబ్రవరి, మార్చి నెలల్లో మిర్చి సాగుచేశారు. ఎకరాకు రూ. 1.3 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు ప్రారంభమయ్యే సరికి ధర పతనం కూడా ప్రారంభమైంది. దీనికి తోడు తెగుళ్ల బెడద తీవ్రం కావడంతో సస్యరక్షణ చర్యలకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోంది. దిగుబడులు మొదలైనప్పటి నుంచి 53 కేజీల బస్తా రూ.500 నుంచి రూ.700కు మించి పెరగడం లేదు. ఇందులో అధికభాగం కోత కూలి చెల్లించేందుకే ఖర్చవుతోందని, పెట్టుబడులు పోను తమకు ఏం మిగులుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. బస్తా ధర రూ.1500కు చేరుకుంటే తమకు కొంతైనా లాభం వస్తుందని అంటున్నారు.



మిరపకాయలు బస్తాలకు నింపుతున్న కూలీలు



మిరపకాయలు కోస్తున్న కూలీలు

గిట్టుబాటు ధర కల్పించాలి

ఎనిమిది ఎకరాల్లో పంట సాగుచేశా: పెట్టుబడి సుమారు రూ.9లక్షలు పైనే ఖర్చు అయింది. ఇప్పటికే రెండు కోతలు కోశాం. కూలీల ఖర్చు పోను రూ.2.50 లక్షలు వచ్చింది. సస్యరక్షణ చర్యలకు రూ.45 వేలు ఖర్చు అవుతుంది. ధరలు పెరిగితే తప్పమిర్చి రైతులు బాగుపడే పరిస్థితి లేదు. ప్రభుత్వం కల్పించుకొని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలి

- వెంకటరామిరెడ్డి, రైతు,ఇప్పట్ల, లింగాల మండలం

పీలేరు వాసులకు కళాజ్యోతి పురస్కారాలు

పీలేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన ముగ్గురు కవు లు, ఒక నటుడు కళా జ్యోతి జాతీయ పుర స్కారాలు అందుకు న్నారు. చిత్తూరులోని భారతీయ తెలుగు రచ యితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండే షన్ సంయుక్తఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రం 'తెలుగు తేజాలకు కళాభిషేకం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య, నటనా రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ కవి, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజు, బహుబాషా నటుడు ఖాదర్ బాషా, కవి సరస్వతి శ్రీరాములు రాజు, ఉపాధ్యాయుడు, కళాకారుడు చంద్రశేఖర్, విశ్రాంత డీటీ వెంకట శేషయ్య ఈ పురస్కారాలు అందుకున్నారు. నటకిరీటి రాజేంద్రప్రసాద్, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యం శర్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ప్రముఖ రచయిత, వక్త డా.నారాయణస్వామి, కార్యక్రమ నిర్వాహకులు ఎంవీ శ్రీధర్ రెడ్డి, మర్రిపూడి దేవేంద్ర రావు పీలేరు వాసులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

కోదండరాముడి సన్నిధిలో పునుగోటి విశ్వనాథం

ఒంటిమిట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయాన్ని వెంకటగిరికి చెందిన తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి పునుగోటి విశ్వనాథం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కోదండరామున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, మేరువ యానాదిరావు, కొత్త శివ, అనుమల అయ్యప్ప, చింతగింజల సుధా, అవ్వారు రవిశంకర్, ఉప్పల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

కడపక్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన మేరువ సుబ్బమ్మ (73) ప్రస్తుతం కడప శ్రీనగర్ కాలనీలో ఉన్న కుమారుడు వద్ద ఉంటోంది. ఈ నెల 14న ఇంటినుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. కుమారుడు సుబ్బరా యుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ కనుగొన్న వారు 9121100520, 9121100521 తెలియజేయాలని వారు కోరారు.



మేరువ సుబ్బమ్మ

వైభవంగా హోమాలు, పూజలు

చక్రాయపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పం గ్రామంలో ఇటీవల అంకాలమ్మ దేవాలయాన్ని నిర్మించారు. అక్కడ విగ్రహ ప్రతిష్ఠ చేసి 41రోజులు కావడంతో హోమాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం అంకాలమ్మదేవతకు శాంతి జరిపించేందుకు గ్రామంలో భారీ ఎత్తున విందును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు భరత్‌కుమార్‌రెడ్డిలకు ఆదివారం ఘనస్వాగతం లభించింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీఆర్ భాస్కర్‌రెడ్డి, మావిరెడ్డి, టీడీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, యోగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి,రామాంజనేయ రెడ్డి, సిద్దారెడ్డిగారిపల్లె గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీనాయకులు సతీష్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు అర్జున్ నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతలకుంట ఈశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ పాలన



కేక్ కట్ చేస్తున్న టీడీపీనాయకులు

కడప నాగరాజుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అందిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈఎస్ అమీర్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో మాజీ సైనికుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి పాలన విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కటింగ్ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాల దాసు, కడపనగర ఉపాధ్యక్షుడు, 15వ డివిజన్ ఇన్‌చార్జి కొండా సుబ్బయ్య, 5వ డివిజన్ ఇన్‌చార్జి బండి జయశేఖర్, టీడీపీ నాయకులు చీకటి చార్లెస్, కడప జిల్లా మహిళాఅధికారి ప్రతినిధి స్వర్ణలత, శ్రీదేవినాయుడు, బీసీ సెల్ దస్తగిరి పాల్గొన్నారు.

లింగాల మండల టీడీపీ అబ్జర్వర్‌గా మడక చక్రధర్

కడప మారుతీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పులివెందుల నియోజకవర్గం లింగాల మండల అబ్జర్వర్‌గా టీడీపీ తొగటవీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ నియమితులయ్యారు. లింగాల మండలంలో తెలుగుదేశంపార్టీ బలోపేతానికి అంకితభావంతో సేవలందిస్తానని చక్రధర్ వెల్లడించారు.

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ రాజీనామా ఆమోదం

కడప, కలెక్టరేట్, జూన్ 15,(ఆంధ్రజ్యోతి): నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉన్న టి.కె.అఫ్జల్ ఖాన్ రాజీనామాను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 12వ తేదీన ఆమోదించారు. వెంటనే అమలులోకి వచ్చేలా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతికి ఆదేశాలు జారీ చేశారు. ఈవిషయాన్ని ఆమె ఆదివారం అధికారికంగా ఒకప్రకటన విడుదల చేశారు.

అమ్మవారిశాలలో సంకట హర చతుర్దశి పూజలు



వేంపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె అమ్మవారిశాల శ్రీవాసవి కన్యకపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం సంకట హర చతుర్దశి పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ తెలిపారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మనేతృత్వంలో వినాయకుడికి వేదమంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆర్యవైశ్య మహిళలు అష్టోత్తరాలు, సంకటహర చతుర్థి వ్రత కథ పఠించారు. 21నెలలు సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆలయ నిర్వాహకుడు మోహన్‌రావు,మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవి కళ్యాణమండపం,ఆవోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంట రుణాలు క్రమబద్ధీకరణ

వీరపునాయునిపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో వ్యవసాయ పంట రుణాలు పొందిన రైతులు పంట రుణాలను క్రమబద్ధీకరించుకుంటున్నారు. బ్యాంకు పరిధిలో 2400 మంది రైతులు ఉండగా 1400 మంది రైతులు ఇంకా రెన్యువల్ చేసుకోవాల్సి ఉందని బ్యాంకు అధికారులు తెలిపారు. రైతులకు ఇచ్చిన తేదీలోపు రెన్యువల్ చేసుకుంటే వడ్డీ రాయితీ వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

ప్రయాణికులకా... బైకులకా..!

●బస్‌షెల్టర్‌లో బైకుల పార్కింగ్ ● ఎండ, వానలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బస్‌షెల్టరు నిండా అడ్డంగా పెట్టిన ద్విచక్రవాహనాలు

కడప క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం చిన్నచౌకు పాత బైపాస్ సంజన్న సర్కిల్ వద్ద బస్‌షెల్టరు ఏర్పాటు చేశారు. అప్పటి ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి సహకారంతో ఈ బస్‌షెల్టరును నిర్మించారు. అయితే తిరుపతి - చెన్నై - రాజంపేట, బద్వేలు, నెల్లూరు, విజయవాడ వైపు వెళ్లే బస్సులన్నీ ఈ రహదారి మీద నుంచే వెళతాయి. ఇక్కడ ప్రయాణికులు కూడా పెద్దసంఖ్యలోనే బస్సులు ఎక్కుతూ దిగుతుంటారు. కానీ కొంత మంది ఇతర ప్రాంతాల్లో పనులు చేస్తున్న వారు ఆ బస్‌షెల్టరులో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తు న్నారు. దీంతో ప్రయాణికులు రోడ్డు మీదనే నిలబడి బస్సుల కోసం వేచిచూసే పరిస్థితి నెలకొంది ఎండా కాలమైనా, వర్షాకాలమైనా కనీసం బస్‌షెల్టరులో వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా వాహనాలు అడ్డం పెడుతున్నారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది.

తిరుపతి - చెన్నై వచ్చే బస్సులు ఆ సర్కిల్ వద్దనే యూటర్న్ తీసుకోవాలి. అయితే దాదాపు అక్కడ యూటర్న్ చేసుకునే సమయంలో ప్రయాణికులు రోడ్డుపై ఉండడంతో యూటర్న్ చేసుకునే సమయంలో బస్సు కూడా జనాలను ఆనుకుని వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి బస్‌షెల్టరులో బైకులు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు ప్రయాణికులు కోరుకుంటున్నారు.

గంగమ్మకు పూజలు



సీకేదిన్నె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చింత కొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కోర్కెలు తీరినవారు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సమీపంలోని వీరభద్రస్వామి, ఆంజనేయ స్వామి, శివాలయం, అక్కదేవతల ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

పంచాయతీ సిబ్బందికి ఆరునెలల జీతాన్ని ఇవ్వాలి

వేంపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీ పారిశుధ్యం అధ్వానంగా ఉందని, నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాన్ని వెంటనే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి అధికారులకు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీలకు కేంద్రం, రాష్ట్రం నుంచి కోట్లాదిరూపాయల వేతనం ఇస్తున్నా కనీసం వేతనాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

సంబరాల్లో మహిళలు



చెన్నూరు కొండపేటలో మిఠాయిలు పంచుకుంటున్న తల్లికి వందనం పొందిన మహిళలు, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థి తల్లి

చెన్నూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న తల్లికి వందనం మైనార్టీ మహిళల్లో ఆనందంనింపింది. మండలంలోని కొండపేట పంచాయతీలో ఆదివారం సాయంత్రం పలువురు మైనార్టీ మహిళలు తల్లికి వందనం అందుకుని ఆనందపడ్డారు. అలాగే ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి , మైనార్టీ నేతలు పెద్దఖాసింపీరా, చిన్న ఖాసింపీరా, గౌస్‌లాజం, జమీల్, అన్వర్‌బాషా, మస్తాన్, మాజీ సర్పంచ్ బాషు, జిల్లా రైతు నేత సుధాకర్‌రెడ్డి, పెద్దక్రిష్టారెడ్డి, కుండేటి క్రిష్ణయ్య, జెండాల ఖాసింపీరా, చంద్రమోహన్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె..: ఇంట్లో అందరి పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయడంతో తల్లిదండ్రుల్లో ఆనందోత్సాహం నెలకొంది. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కేకలువేస్తూ వారి ఆనందాన్ని వ్యక్తపరుచుకున్నారు. ఆదివారం కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్‌లో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ చిత్రపటాలకు టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలు సునీత, 14వ డివిజన్ ఇన్‌చార్జి దివాకర్, మాజీ కార్పొరేటర్ చిన్నబాబు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అర్బన్ సీఐ చాంద్‌బాష

పులివెందుల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలు నిలుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ మట్కా,జూదం,అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఐ విష్ణు, సిబ్బంది ఉన్నారు.

సిలబస్‌లో విలువలతో కూడిన పాఠ్యాంశాలను పొందుపరచాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సిలబస్‌లో విలువలతో కూడిన పాఠ్యాంశాలను పొందుపరచాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువల విద్య అనే పుస్తకాలను ప్రభుత్వం అందజేస్తున్న సందర్భంగా ఆయన పలుసూచనలు ఇచ్చారు.

రూ.7లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పులివెందుల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి చొరవతో కోతిల్ల వెంకటసురేష్‌కుమార్‌కు వైద్యఖర్చు నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

ఆశాలకు లెప్రసీ అలవెన్స్ అందేలా కలెక్టర్ స్పందించాలి

కడప మారుతీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జల్లాలో నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో వున్న ఆశా కార్యకర్తల అలవెన్స్ తక్షణమే చెల్లించేలా కలెక్టర్ చెరకూరి శ్రీధర్ స్పందించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, కోశాధికారి అమ్ములు, ఓ. సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసినవారిపై చర్యలు తీసుకోండి

కడప మారుతీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మహిళలను మోసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిలభారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కె. సుబ్బమ్మ జిల్లా అధికారులను కోరారు. ఆదివారం స్థానిక ఓంశాంతినగర్ సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆ మేరకు ఒంటిమిట్ట ఆలయంలో స్వీపర్ ఉద్యోగాల కోసం తమ బంధువులను పనికి పెట్టి కొంత డబ్బులు ముట్టచెప్పానన్నారు. కాగా వారికి నెలనెలా వేతనాలు అంది తర్వాత అందలేదన్నారు. పనిచేసేవారికి నకిలీ పత్రాలు, గుర్తింపు కార్డులతో కాలం వెళ్లదీశారని ఆరోపించారు. శిక్షణ నిమిత్తం విజయవాడకు రావాలని ఆదేశించడంతో అసలు విషయం బయటపడిందన్నారు. సమావేశంలో చిప్పగిరి మీనాక్షి, అరుణకుమారి, బాధిత మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వేంపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితకంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మానవత సేవా సంస్థ సహకారంతో స్థానిక చైతన్య హైస్కూల్లో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు శ్రేయ,లక్ష్మీప్రత్యూష 400 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. 45 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించేందుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు చక్రపాణిరెడ్డి, మీగడ రామమునిరెడ్డి, తేజ, శ్రావణ్‌కుమార్, బాలాజి, శ్రీకళ, అరవింద్ కంటి ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్నపల్లెలో ముగిసిన భాగవత పఠనం

లింగాల,జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో కల్యాణరామస్వామి ఆలయంలో జరుగుతున్న భాగవత సప్తాహ పఠనం ఆదివారంతో ముగిసింది. ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు భాగవత సప్తాహ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో భాగవత భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దకుడాలగ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు భాగవత సప్తాహ పఠనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూలకు చేరిన చేతుల పరిశుభ్రత యంత్రాలు



పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పనికిరాకుండా పోయిన యంత్రాలు

పులివెందుల రూరల్,జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మనం ఆహారం తీసుకునే సమయంలో చేతులు పరిశుభ్రంగా లేకపోతే శరీరంలోకి క్రిములు, బబ్యాక్టీరియా చేరి వ్యాధులు వ్యాపింపజేస్తాయి. వాహనాల్లో ప్రయాణించేటపుడు, హోటల్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ఇలా ప్రతి వ్యక్తి ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టినప్పటి నుంచి చేతులకు దుమ్ము, ధూళి అవుతుంది. చేతులు కడిగే సమయం లేకనో లేదా సమయం ఉన్నా అందుబాటులో నీరు లేకపోవడంతోనో బయట ఆహారాన్ని తినాల్సి వస్తుంది. చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ వారు అడుగు ముందుకేశారు. కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆలోచన మొదలుపెట్టిన యూనిసెఫ్ తర్వాత కూడా కొనసాగేలా పలు యంత్రాలను వితరణ చేసింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద వీటిని ఏర్పాటుచేసింది. శానిటైజర్ ఒకపక్క, నీరు వచ్చేలా ఏర్పాటుచేశారు. చేతుల పరిశుభ్రత జీవితంలో ఒక భాగం కావాలని నాందిపలికిన ఆలోచనకు ప్రభుత్వ ఆసుపత్రుల అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఒక మంచి ఆలోచన ముందుకెళ్లకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఎందుకు పనికిరాకుండా పోయాయి.


ఘనంగా రామగిరి బాబా ఆరాధన మహోత్సవాలు



కడప కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగర 40వ డివిజన్ అక్కాయపల్లె భవానీనగర్ అంబాభవానీ ఆలయంలో వెలసిన శ్రీ భగవాన్ రామగిరిబాబా ఆలయ 162వ గురుపూజ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భగవాన్ రామగిరిబాబా సేవాసమితి అధ్యక్షుడు రాజభాస్కర్‌రావ్ షిండే ఆధ్వర్యంలో సాగుతున్న మహోత్సవాలు ఈనెల 19 వరకు (ఐదురోజులు) జరుగనున్నాయి. కాగా టీడీపీ రాష్ట్ర నాయకుడు బి. హరిప్రసాద్, ఆలయాన్ని దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షిండే సంతోష్‌కుమార్, రాధాబాయి, గీత, నాగభాస్కర్, అమర్‌నాథ్‌రెడ్డి, వైయం ప్రతాప్‌రెడ్డి, మల్లేసు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకట్ట తొలగించరా..?

● మురుగునీటితో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● ఆందోళనలో తల్లిదండ్రులు



మురుగు నీరు వెళ్లకుండా రోడ్డుపై అడ్డంగా కట్టిన సిమెంటు కట్ట

చెన్నూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ముందు రెండేళ్లుగా నిల్వ ఉన్న మురుగునీరు తొలగించక పోవ డంతో నిలిచిన నీరు కాస్త దుర్గంధభరితంగా మారి దోమలు పెరిగి రోగాలకు ఆలవాలమైంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు నిల్వఉన్న మురుగునీరు తొలగిస్తారా లేదా అన ఆగ్రహం వ్యక్తం చేస్తునానరు. మండలం లోని బయనపల్లె గ్రామ పంచాయతీలో ఉర్దూ పాఠశాల ముందే రాకపోకలకు వీలుగా సిమెంటు రోడ్డు వేశారు. అయితే ఆ వీధిలోనే కొందరు ఇళ్లల్లోకి నీరు బయటికి వదులుతున్నారని కొందరు ఇళ్లలోకి మురుగునీరు వస్తుందని మరికొందరు ఇలా ఒకరికొకరు పోటీ పడి నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా రోడ్డు పూర్తిగా రెండు చోట్ల చెక్‌డ్యాంలకు సిమెంటుతో అడ్డుకట్టలు కట్టారు.

సుమారు అడుగు ఎత్తుమేర అడ్డుకట్టలు కట్టడంతో ఇళ్లల్లో నుంచి వచ్చిన నీరు వర్షం వల్ల కురిసిన నీరు బయటికి పోయేందుకు అంగుళం కూడా సందులేక పోవడంతో అలాగే నిలిచి పోతుంది. ఫలితంగా నెలల కొద్దీ నిలిచిన నీరు దుర్గంధభరితంగా మారి దోమలకు నిలయంగా మారింది. దీంతో మురుగునీరు పక్కనే ఉన్న ఉర్దూపాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారు. సంవత్సరానికి పైగా ఇదే పరిస్థితి ఉండడంతో వీటిని ఎప్పుడు తొలగిస్తారా, ఎదురుచూస్తున్నారు.

అడ్డుకట్టలు తొలగిస్తాం

మురుగునీరు నిలిచిన చోట అడ్డుకట్టలు తొలగిస్తాం. సోమవారం ఉదయం ఆ నీటిని పూర్తిగా తొలగిస్తాం, అడ్డుకట్ట లేకుండా చేస్తాం. భవిష్యత్తులో ఎవరైనా వీధుల్లో అడ్డుకట్టలు కడితే వారిపై చర్యలు తీసుకుంటాం. అంతేకాక పాఠశాల ఉన్న చోట ఇలాంటి పనులు చేయడం దారుణం, ఇందుకు బాధ్యులైన వారిని ఉపేక్షించేలేదన్నారు.

సురేశ్‌బాబు,ఈవోఆర్‌డీ

ప్రతి ఇంటికి ఒక పోస్టల్ ఖాతా లక్ష్యం



జి.కిరణ్
పోస్టల్ సూపరెంటెండెంట్, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో ఒక పోస్టల్ ఖాతాను వినియోగించుకునే విధంగా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ప్రొద్దుటూరు పోస్టల్ సూపరింటెండెంట్ జి. కిరణ్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు పోస్టల్ శాఖ విస్తృత సేవలు అందిస్తోందని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఫేస్ టు ఫేస్

ప్రశ్న: పోస్టల్ శాఖలో అందిస్తున్న ముఖ్యమైన సేవలు ఏమిటి ?

జవాబు: పోస్టల్ శాఖలో ఒకటి ఉత్తరాల విభాగంలో స్పీడ్ పోస్ట్ పార్సి ల్, రిజిస్టర్ పోస్ట్.రెండు పొదుపు విభా గంలో పొదుపు, ఆర్‌డీ సేవలు. మూడుఇన్సూరెన్స్‌లు ఉన్నాయి.

ప్రశ్న: పోస్టల్‌లో ఎన్ని రకాల ఇన్సూరెన్స్‌లు ఉన్నాయి ?

జవాబు: పోస్టల్ శాఖలో రెండు రకాల ఇన్సూరెన్స్‌లు ఉన్నాయి. ఒకటి పీఎల్‌ఐ. ఇది ఎంప్లాయీస్, గ్రాడ్యుయేట్స్, లాయర్స్, డాక్టర్స్ తదితర ఉద్యోగుల కోసం. రెండవది ఆర్‌పీఎల్‌ఐ గ్రామీణ ప్రజలకు, ఉద్యోగాలు చెయ్యని వారి కోసం.

ప్రశ్న: డిజిటలైజేషన్ వల్ల పోస్టల్ సేవలో ఏమైనా మార్పులు వచ్చాయా ?

జవాబు: డిజిటలైజేషన్ ద్వారా పొదుపు ఖాతాలు కలిగిన వినియోగదారులకు ఏటీఎం, నెట్ బ్యాంకింగ్, ఆన్లైన్ ద్వారా ఏ బ్రాంచ్ నుంచైనా ఇతర బ్రాంచులకు లావాదేవిలు చేసే సౌకర్యం ఉందన్నారు.

ప్రశ్న: పోస్టాఫీస్‌లో మహిళలకు ప్రత్యేకమైన పథకాలు ఏమైనా ఉన్నాయా ?

జవాబు: పోస్టాఫీస్‌లో మహిళల కొరకు ప్రత్యేకంగా 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం, మహిళలందరి మహిళ సన్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ పథకాలు ఉన్నాయి.

దువ్వూరులో వర్షం

దువ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో ఆదివారం వర్షం పడింది. ఇటీవల ఆకాశం మేఘావృతమై ఊరిస్తున్నా వానజాడ కానరాలేదు. అంతకుముందు అకాల వర్షాలు పడడంతో రైతులు కొందరు సేద్యాలు చేశారు. మంచి వాన పడితే దుక్కులు చేయాలనే తలంపులో చాలా మంది రైతులు ఉన్నారు. రుతుపవనాలు ముందే వచ్చినా సరైన వర్షం ఇప్పటికి పడలేదు.

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో..?

- రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు
- మెయిన్‌రోడ్డును ఆక్రమించి తోపుడు బండ్లు
- జమ్మలమడుగులో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



జమ్మలమడుగు పాత బస్టాండు వద్ద ట్రాఫిక్ కష్టాలు

జమ్మలమడుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రమైనజమ్మలమడుగు, పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు ఎక్కువవుతోంది. దీంతో స్థానికులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాత బస్టాండులో బస్సులు, కార్లు తదితర వాహనాలు రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. తోపుడుబండ్ల వ్యాపారులు మెయిన్‌రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్యకు మరో కారణం ఉంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక జమ్మలమడుగులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూరగాయల మార్కెట్‌వీదిలో పూలవ్యాపారులకు వెనక్కు పంపించి రోడ్డు విశాలంగా చేశారు. అయితే గాంధీ విగ్రహం పక్కన పడమరవైపు వరుసగా ముద్దనూరు రోడ్డుకు వివిధ దుకాణాలు ఎదురుగా తోపుడు బండ్లు వెలిశాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికి ఏ ఒక్కరికి పట్టడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు రోడ్డును ఆక్రమిస్తున్నా అడిగేవారు లేరు. ప్రధాన రోడ్డుపై ప్రొద్దుటూరు వైపు నుంచి నాన్‌స్టాప్ సర్వీసులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు గాంధీ విగ్రహం వద్ద, మలుపులో కర్నూలు రోడ్డుకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఇక్కడ తోపుడుబండ్లు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో డ్రైవర్లు వాహనాలను అతి జాగ్రత్తగా నడపాల్సి వస్తోంది. ఏమాత్రం పొరపాటు జరిగినా ప్రమాదం జరుగుతుందోనని బస్సు డ్రైవర్లు భయం భయంతో మలుపులో తిప్పుకుని వెళుతుంటారు. గత ఏడాది అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు తోపుడుబండ్లవైపు బ్రేక్ ఫెయిల్ అయి దూసుకొచ్చిన ఘటనలో అక్కడున్న ద్విచక్ర వాహనాలు ధ్వంసమై లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం అధికారులు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆ ప్రాంతంలో చర్యలు తీసుకుని ప్రమాదం జరుగకముందే రోడ్డు వెడల్పు చేయాలని ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు, అధికారులు విన్నవించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి ఈ సమస్యను డిపో మేనేజర్ ప్రవీణ్, వారి సిబ్బంది తెలియజేసినట్లుగా కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వెంటనే చర్యలు తీసుకోవాలనిపట్టణవాసులు కోరుతున్నారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతమార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

దాసరిపల్లెలో ఘనంగా పోలేరమ్మ జాతర

పోరుమామిళ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాసరిపల్లెలో సీతా రామలక్ష్మణ హనుమత్‌సమేత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ముగిసి 41 రోజులు పూర్తికావస్తున్న సందర్భంగా ఆదివారం ఆ గ్రామస్థులు పోలేరమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే మసలరెడ్డిపల్లె పంచాయతీలోని సిద్దనకిచ్చాయపల్లెలో రామాలయం ప్రతిష్ఠ జరిగి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామ దేవత అయిన అంకాలమ్మకు బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పంచాయతీరాజ్ మాజీ సలహాదారుడు నాగార్జునరెడ్డి, రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, రాజీవ్‌బాషా పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమాలకు పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ హాజరయ్యారు.

పెంచలకోన మహా పాదయాత్ర ప్రారంభం



బద్వేలు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి ఆదివారం ఉదయం 6గంటలకు పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వరకు మహాపాదయాత్రను ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్యస్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పాదయాత్ర వీపీకుంట, చుంచులూరు, చిలకలమర్రి మీద పెంచలకోన వరకు సాగనుంది. పాదయాత్రలో దీక్షా పరులు లక్ష్మీ నరసింహస్వామి భక్తులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మాతమ్మతల్లికి బోనాలు

బి.కోడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శిరిగిరిపల్లె గ్రామంలో ఆదివారం మాతమ్మతల్లికి గ్రామస్థులు బాణసంచా బ్యాండు మేళాతాళాలతో వైభవంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులతో గ్రామమంతాకిక్కిరిసింది. ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొండాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగాపురం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బనగానపల్లె కు చెందిన భాస్కర్ అనే వ్యక్తి కొండాపురం నుంచి తాడిపత్రి వైపుకు బైకులో వెళుతుండుగా అదుపుతప్పి జోగాపురం వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపతి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వివాహవేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరద



వివాహ వేడుకలకు హాజరైన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

రాజుపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం మండలం వెలవలి గ్రామ వాస్తవ్యులు కాలేసాహెబ్ జాకీర్ హుసేన్ కుమార్తె నిఖా వేడుకల్లో ఆదివారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ముక్తియార్, బీవీ సుధాకర్‌రెడ్డి, గ్రామ నాయకులు మానికింది ఖాదర్‌బాషా, కొట్టాల జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నార.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

మైలవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లుల ఖాతాలో నగదు జమ కావడంతో తల్లిదండ్రులు సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. మండల పరిధిలోని వేపరాల గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో, తలమంచిపట్నం గ్రామంలో ఇంటిలో చదువుతున్న పిల్లలందరికి రూ.15 వేలు పడడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీదేవి, పాములేటి, మాజీ సర్పంచ్ కొండయ్య, లక్ష్మినాయుడు, శ్రీనివాసులు, చెంగయ్య, ప్రసాదు, ఉమానాథ్, వెంకటేషు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

జమ్మలమడుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమికి ఏకైక ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడని కృష్ణం వందే జగద్గురు అంటూ జమ్మలమడుగులోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ నాయకులు త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. జమ్మలమడుగు మండలంలో గండికోట గ్రామంలో ఆదివారం త్రైత సిద్దాంత ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక జమ్మలమడుగు కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి త్రై సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను అందించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రంగనాయకులు, శివ, నాగరాజు, వెంకటరెడ్డి, సురేంద్ర, లక్ష్మి, సుజుస్విని, పూర్ణిమ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలిన తారు రోడ్డుతో ఇక్కట్లు



దువ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తమలపాకు మందంతో వేశారో ఏమో అయిదేండ్లకే రోడ్డు పాడైంది. రైతుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ పరిస్థితి దువ్వూరు సమీపంలోని పొలాల్లోకి వెళ్లే దారిలో నెలకొంది. దువ్వూరు గ్రామం నుంచి జడ్డి పొలాల మీదుగా సుమారు అయిదు కిలోమీటర్ల పొడవునా వైసీపీ ప్రభుత్వ హయాంలో తారు రోడ్డు పనులు జరిగాయి. ఈ పనులు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో చేశారు. వాటిని చేపట్టి అయిదేళ్లు దాటింది. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతుంటారు. దువ్వూరు నుంచి కుందూ సమీపానికి అటు నుంచి ఏటూరు గ్రామ పరిధి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ప్రధానంగా రైతుల రాకపోకలకు ఎక్కువగా ఈ దారి ఉపయోగపడుతుంది. ప్రస్తుతం అతుకులు గతుకులుగా రోడ్డు పాడై కనపడుతోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. తారురోడ్డును బాగు చేసి రాకపోకల ఇబ్బందులను తొలగించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ముళ్లపొదల నడుమ ఎంపీడీవో కార్యాలయం



ముద్దనూరు జూన్15(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం ముళ్లపొదల నడుమ దర్శనమిస్తోంది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఉంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంతాలలోని అండర్‌డ్రైనేజీ మురుగు నీరు ఎంపీడీవో కార్యాలయం పక్క నుంచి అటువైపు వెళుతుంటుంది. దీంతో ఎంపీడీవో కార్యాలయం ఒక పక్క రహదారి చుట్టూ కంపచెట్లు విపరీతంగా పెరిపోయి విషపురుగులు అధికంగా వస్తున్నాయని ఉద్యోగులు, సిబ్బందితోపాటు స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి చోటు నుంచి సమీపంలోని కాలనీకి ప్రజలు వెళ్లాలంటే ఒక పక్క విషపురుగులు, మరో పక్క మురుగునీరు దుర్వాసనతో హడలిపోతున్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

ఎర్రగుంట్ల, జూన్15(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీ ఉదయం 10.30గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉపాధిహామీ, సాధారణ పరిపాలన, రెవెన్యూ, ఇతర శాఖలపై చర్చ జరుగుతుందన్నారు.

వైద్య రంగం అభివృద్ధికి కృషి చేయాలి



డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యరంగం అభివృద్ధికి డాక్టర్ వరుణ్‌కుమార్ కృషి చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే దేవగుడి ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాష్ట్రానికి ఎంత అవసరమో ప్రొద్దుటూరుకు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి అంతే అవసరమన్నారు. వైద్యం తెలిసిన ఆయనను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సభ్యునిగా నియమించడం హర్షణీయమన్నారు. ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సభ్యునిగా వరుణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారని తెలిపారు. ఆయన కరోనా సమయంలో తక్కువ ఖర్చుతో ఎందరో పేద ప్రజల ప్రాణాలను కాపాడారని పేర్కొన్నారు. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సహకారంతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సభ్యునిగా నియమితులయ్యానన్నారు. వైద్య విద్యలో నైతిక విలువలు పెంచడానికి కృషి చేస్తానన్నారు.

గుండె వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపట్ల నిర్లక్ష్యం చేయరాదని సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తగా మెలగాలని ప్రముఖ గుండెవైద్య నిపుణుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డులోని లక్ష్య సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో 50వ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల మూడవ ఆదివారం తమ ఆస్పత్రి తరుపు పేదలకు ఉచిత వైద్యశిబిరం ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. ఆదివారం గుండె, కంటి, వైద్య పరీక్షలు నిర్వహించి ఈసీజీ స్కానింగ్‌లను చేసి రోగులకు తగిన సూచనలు అందించామన్నారు. ఇందులో భాగంగా మొత్తం 48 మంది రోగులను పరీక్షించగా వారిలో 27 మందికి ఈసీజీ, ఏడుగురికి ఉచితంగా గుండెకు ఎకోటుడి స్కాన్ చేసి తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. డాక్టర్ హరిత ఆధ్వర్యంలో 34 మంది రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు.

వేంపల్లి టీడీపీ పరిశీలకుడిగా నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వేంపల్లె మండల పరిశీలకునిగా ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజును పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. 2024-26 సంబంధించి మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీల నియామకాలకోసం ఆయనను పరిశీలకులుగా నియమించారు. విధి విధానాలను పార్టీ ప్రకటించింది. పార్టీ నిర్దేశించిన తేదీల్లో ఆ మండలానికి వెళ్లి సమావేశం నిర్వహించి పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు ప్రతిపాదనలు తీసుకుని పార్టీ క్షేత్ర కార్యాలయానికి నివేదించాలి. అలాగే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పోటీ పడే అభ్యర్థులపై అభిప్రాయం సేకరించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో పార్టీ కార్యాలయం ఇచ్చిన విధి విధానాలను కచ్చితంగా పాటించాలని పార్టీ సూచించింది. ప్రతిష్ఠాత్మకమైన పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి మండలానికి నల్లబోతుల నాగరాజును నియమించడంపట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దముడియం మండల పరిశీలకునిగా చింతకుంట కుతుబుద్దీన్, తొండూరు మండల పరిశీలకునిగా తాటి శ్రీనివాసులుయాదవ్‌ను నియమించారు.

మైదుకూరుకు పరిటాల...

బి.కోడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన ఆర్యవైశ్య రాష్ట్ర డైరెక్టరు పరిటాల వెంకటసుబ్బయ్యను రాష్ట్ర అధినాయకత్వం మైదుకూరు నియోజకవర్గం టౌన్ పరిశీలకునిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం తనకు అప్పగించిప బాధ్యతను వమ్ముకాకుండా అన్నివిధాలా పార్టీకి సహకరిస్తూ బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు.

ఖాజీపేటకు కొలవలి వేణుగోపాల్...

బద్వేలుటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఖాజీపేట మండలం టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టుకున్న నమ్మకానికి శక్తివంచన లేకుండా కృషిచేసి పార్టీ గెలుపే లక్ష్యంగా కృషిచేస్తానని ఆయన అన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతం



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాస నగర్ సర్కిల్ వద్ద ప్రొద్దుటూరు అంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ వీఎస్ ముక్తియార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఆధివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వీఎస్ ముక్తియర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు వచ్చే రోగాల నుంచి ఉపశమనం కల్పించడానికి హోలీస్టిక్ హస్పిటల్ వైద్య సిబ్బందితో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజీ, ఆర్థో, జనరల్ వివిధ రకాల వైద్యులు పాల్గొని సుమారు 500మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందాంచారు. ఈ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని విజయవంతంగా సద్వినియోగం చేసు కున్న శ్రీనివాస నగర్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మెడికల్ క్యాంప్ ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు అంజుమన్ కమిటీ మాజీ అధ్యక్షుడు బొల్లవరం బాషా, ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జ్ ఎండీ అయూబ్ ఖాన్, టీడీపీ మైనారీటి సెల్ అధ్యక్షుడు ఎస్ ఎం బాషా, 14వ వార్డు కౌన్సిలర్ ఎస్ జిలాని బాషా, మాజీ కౌన్సిలర్ టి. మహబుబ్ బాసా, తదితరులు పాల్గొన్నారు.

తిప్పలూరులో చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరులో నూతనంగా నిర్మించిన ఏలీము సీఎస్‌ఐ చర్చిని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించారు. సుమారు రూ.90లక్షలతో ఈ చర్చిని నిర్మించారు. గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ మాజీ సలహాదారు అంబటి క్రిష్టారెడ్డి, ఆయన సతీమణి తిప్పలూరు సర్పంచి అంబటి పార్వతమ్మలు రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే భారతి సిమెంట్స్ యాజమాన్యం రూ.25లక్షలు, చర్చి సంఘం పెద్దలు రూ15లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ఎన్‌డీఏ మండల ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి, ఫాదర్స్ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

రాజుపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతులకందించే అన్నదాత సుఖీభవ పథకం రావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివరామక్రిష్టారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ కోసం సోమవారం నుంచి ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వేలిముద్రలు వేయాలన్నారు. ఈకేవైసీ చేయించుకున్న రైతుల పేర్లు రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. మండల వ్యాప్తంగా 5702 మంది రైతులకు ఈ పథకానికి అర్హులుగా ఉన్నారన్నారు. సరైన సమయానికి వేలిముద్ర వేస్తే ఈ పథకంలో లబ్ధి పొందుతారన్నారు. ఫోను ద్వారా వచ్చే ఓటీపీతో అవకాశమే లేదని రైతులంతా గమనించి రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వేలిముద్రలు వేయాలని తెలిపారు.